సాక్షి

వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 23 । మార్చి । 2025



చెరువు మట్టి..చెరబట్టి

పూర్వం నిర్మించిన చెరువులను రోడ్డు నిర్మాణం కోసం అనుమతులు ఉన్నాయని ఇష్టం వచ్చినట్లు ప్రైవేటు కాంట్రాక్టర్లు చెరువును తవ్వేస్తూ ధ్వంసం చేస్తున్నారు.

-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది॥ (సా॥)	సహార్ సోమ॥ (ఉ॥)
కడప	: 6.31	5.03
పులివెందుల	: 6.33	5.08
ప్రొద్దుటూరు	: 6.32	5.07

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.6/25.2

జిల్లాలో శనివారం 25.2 - 38.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పది పరీక్షకు 4326 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్–2 (కంపోసిట్ కోర్సు), ఏఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–1(సంస్కృతం, అరబిక్, పర్షియస్) పరీక్షలు జిల్లావ్యాప్తంగా 99 పరీక్షా కేంద్రాల్లో జరిగాయి. 4346 మంది విద్యార్థులకుగాను 4326 మంది హాజరుకాగా 20 మంది గైర్హాజరయినట్లు డీఈఓ షంషుద్దీన్ తెలిపారు. జిల్లాలో 6 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 33 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా తాను మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశానని వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని డీఈఓ తెలిపారు.

నేడు కడపలో షేర్ మార్కెట్‌పై ఉచిత సదస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరం హరిత హోటల్‌లో ఆదివారం ఉదయం 11, మధ్యాహ్నం 3, రాత్రి 7 గంటలకు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఫైనాన్షియల్ అడ్వయిజర్ కె.కృష్ణకైలాస్ ఒక ప్రకటనలో తెలిపారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు ఎలా పెట్టాలి? భవిష్యత్తు అవసరాలకు ఇన్వెస్ట్ ఎలా చేస్తే లాభాలు పొందవచ్చు? అనే అంశాలపై ఆర్థిక రంగంలోని నిపుణుల ద్వారా తెలుసుకుని న్యాయపరంగా ఆదాయాన్ని ఎలా పెంచుకోవచ్చనే అంశాలను చర్చిస్తామని పేర్కొన్నారు.

మహిళల్లో రక్తహీనత నివారణకు కృషి చేద్దాం



రక్తహీనత నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బద్వేలు అర్బన్: మహిళల్లో రక్తహీనత నివారణకు వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా గణాంక అధికారి డాక్టర్ ఎ.రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కొంగలవీడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. జిల్లా పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ అరుణకుమారి, డీపీఎంఓ నారాయణ, వైద్య సిబ్బంది రాజశేఖర్, జాకోబ్, వెంగయ్య, చంద్రావతి, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



‘జెడ్పీ పీఠం’ వైఎస్సార్‌సీపీదే!

- పూర్తి సంఖ్యా బలంతో ఆత్మవిశ్వాసంలో వైఎస్సార్‌సీపీ
- నేడే జెడ్పీ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ!
- 27న ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు కలెక్టర్ సన్నాహాలు
- అదే రోజు నామినేషన్ స్వీకరణ, చైర్మన్ ఎన్నిక



జిల్లా పరిషత్ సమావేశ భవనం

సాక్షి ప్రతినిధి, కడప: జిల్లా పరిషత్ చైర్మన్ సీటు మరోసారి వైఎస్సార్‌సీపీ సొంతం కానుందా... అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. పూర్తి సంఖ్యా బలంతో వైఎస్సార్‌సీపీ ఆత్మవిశ్వాసంతో బరిలో దిగుతుండగా.. బలం లేక టీడీపీ వెనకంజలో ఉంది. కాగా జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు ఆదివారం కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈనెల 27న చైర్మన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రక్రియను కొనసాగించనున్నారు. గురువారం ఉదయం 10గంటలకు నామినేషన్ స్వీకరణ, 12గంటలకు నామినేషన్లు పరిశీలన అనంతరం తుది జాబితా విడుదల చేయనున్నారు. 1గంటలకు నామినేషన్ ఉపసంహరణ ఉంటుంది. అనంతరం ఎన్నిక ప్రక్రియను కొనసాగించనున్నారు.

జిల్లాలో 50 జెడ్పీటీసీ సభ్యులు..

జిల్లాలో 50 మంది జెడ్పీటీసీల్లో పులివెందుల జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి ఓ ప్రమాదంలో చనిపోయారు. ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి జడ్పీ చైర్మన్‌గా కొనసాగుతూ రాజంపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జెడ్పీకి రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. గత జెడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గోపవరం జెడ్పీటీసీ రామకృష్ణారెడ్డి మాత్రమే టీడీపీ నుంచి ఎన్నికయ్యారు. మిగతా 49 మంది జెడ్పీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నికైన వారే. వారిలో రెండు స్థానాలు ఖాళీలతోపాటు, 5మంది పార్టీ ఫిరాయించారు.

వైఎస్సార్ సీపీకి పూర్తి సంఖ్యా బలం

వైఎస్సార్‌సీపీ 42 మంది జెడ్పీటీసీ సభ్యుల బలంతో పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉంది. పార్టీ ఫిరాయించిన 5మంది జెడ్పీటీసీలకు సైతం విప్ జారీ చేయనున్న నేపథ్యంలో వారు కూడా వైఎస్సార్‌సీపీని బలపర్చేందుకు సన్నద్ధులైనట్లు సమాచారం. తగిన సంఖ్యాబలం లేకపోవడంతో అధికార తెలుగుదేశం పార్టీ చైర్మన్ ఎన్నికపై వెనుకంజ వేయనున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అలా కాకుండా పోటీకి సిద్ధమైతే అభాసుపాలైతామనే భావన కూడా ఆ పార్టీ పెద్దల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తిరుపతి కార్పొరేషన్ పరిధిలో డిప్యూటీ మేయర్ పదవి ఎన్నికల్లో బలం లేకపోగా, అధికారం ప్రయోగించి చేజిక్కించుకున్న పరిస్థితి కారణంగా ప్రజలల్లో టీడీపీ అభాసుపాలయ్యింది. ఈ పరిస్థితులల్లో కడపలో అలాంటి ప్రయోగం చేయరాదనే దిశగా టీడీపీ అధినేత చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిల మధ్య ఉన్న ఐక్యత, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమన్వయం నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ సునాయసంగా చైర్మన్‌గిరిని కైవసం చేసుకోనున్నట్లు పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు.

రామగోవిందురెడ్డిని వరించనున్న చైర్మన్‌గిరి



బ్రహ్మంగారిమఠం మండల జెడ్పీటీసీ ముత్యాల రామగోవిందురెడ్డికి జెడ్పీ చైర్మన్‌గిరి దక్కనున్నట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు వెల్లడిస్తున్నారు. రెండు పర్యాయాలుగా అక్కడి నుంచి జెడ్పీటీసీగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇదివరకే పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా నేతలతో ప్రత్యేకంగా సమావేశమై రామగోవిందురెడ్డి అభ్యర్థిత్వాన్ని ఎంపిక చేసినట్లు సమాచారం. కాగా ఆ మేరకు గురు, శుక్రవారాల్లో ఆ పార్టీ నేతలు జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జెడ్పీటీసీ సభ్యులతో సైతం సమాలోచనలు చేశారు. చైర్మన్‌గిరిని కైవసం చేసుకునేందుకు, కలిసికట్టుగా ఎన్నిక ప్రక్రియ వ్యవహారం నడిపించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ జెడ్పీ చైర్మన్‌గిరి స్థానాన్ని పార్టీకి పదిలంగా ఉంచుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

కొనసాగుతున్న కూటమి కక్ష సాధింపులు

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తోంది. ఇందులో భాగంగానే చింతకొమ్మదిన్నె ఎంఈఓ–1 ఉండేల వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఆర్‌జేడీ కాగిత శ్యాముల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల కాలంలో ఎంఈఓ–1 వెంకట్రామిరెడ్డి వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ గ్రూపులో తన వ్యక్తిగత అభిప్రాయం వెలువరించాడు. విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉంటూ పనితీరులో విద్యాశాఖ అధికారుల మన్ననలు పొందిన ఎంఈఓకు మండలంలో పనిచేసే కొందరు ఉపాధ్యాయ సంఘ నాయకులకు అభిప్రాయ బేధాలు ఉన్నాయి. దీంతో వారు వాట్సాప్ గ్రూపులోని అంశాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. అలాగే ఫిర్యాదు చేయడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో విషయం బయటకు వచ్చింది. వెంటనే అధికారులు చర్యలు చేపట్టారు. ఈ విషయమై ఆర్‌జేడీ కాగిత శ్యాముల్‌తో మాట్లాడగా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టడంపై ఫిర్యాదు రావడంతో ఈ మేరకు విచారణకు కమిటీ వేశామన్నారు.కమిటీలో నిజమని తేలడంతో సస్పెండ్ చేశామని తెలిపారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

వల్లూరు (చెన్నూరు): చెన్నూరులో నేటి రాత్రి నుంచి ప్రారంభమయ్యే నడివీధి గంగమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జంతుబలులు ఇచ్చి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఏటా ఉగాది పర్వదినానికి ముందు వచ్చే ఆదివారం గంగమ్మ జాతర నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ పురుషోత్తం రాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో జాతర జరుపుకోవాలని సీఐ తెలిపారు.

కవర్ చుట్టు.. లాభాలు పట్టు

- రూపాయి ఖర్చుతో ఫల రాజసం
- మామిడిలో కాయతొలుచు, పండుఈగ పురుగుకు కవర్లతో చెక్
- 50 శాతం సబ్సిడీతో అందుబాటులో కవర్లు
- ప్రతి రైతుకు ఐదెకరాల వరకు అందించనున్న ఉద్యానశాఖ
- జిల్లాలో 100 హెక్టార్లకు టార్గెట్ ప్రకటించిన ప్రభుత్వం



చక్రాయపేట మండలంలో సాగులో ఉన్న మామిడితోట (ఇన్‌సెట్) కాయకు అమర్చిన కవరు

కడప అగ్రికల్చర్: మామిడి రైతులు కొత్త పంథా ఎన్నుకున్నారు. మంచి దిగుబడి కోసం వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు. వీరికి ఉద్యానశాఖ ప్రోత్సాహకాలు అందిస్తోంది. జిల్లాలో 9642.43 ఎకరాల్లో మామిడపంట సాగులో ఉంది. మామిడి రైతులు సరైన యాజమాన్య చర్యలు చేపట్టినా పంట సమయంలో పురుగులు తెగుళ్ల ఆశించడంతో నాణ్యత తగ్గి దిగుబడులు పడిపోతున్నాయి. కాయ ఎదిగే దశలో పురుగులు తెగుళ్లతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా పెట్టుబడి భారీగా పెరిగి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఎక్కువసార్లు అధిక డోస్ కలిగిన పురుగుమందులు పిచికారి చేయడం వల్ల పురుగుమందుల అవశేషాలు పండ్లల్లో ఉండి వాటిని తిన్నవారికి క్యాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పురుగుమందుల వాడకం తగ్గించి నాణ్యమైన పంట చేతికి రావడానికి అధిక ఆదాయం పొందడానికి కాయలు ఎదిగే దశలో కవర్లు తొడగాలని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

కవర్లపై గుర్తులు వేసుకోవాలి...

మామిడికాయలు అన్ని ఒకే దశలో రావు. కాయలకు కవర్లు తొడిగేటప్పుడు మనం తొడిగిన తేదీలు లేదా నెంబర్లు వేసుకుంటే ముందు ఏది తొడిగాం తొడిగిన తర్వాత ఎన్ని రోజులు అయ్యిందో సులభంగా తెలుసుకోవచ్చు. దాని ప్రకారం కాయలు కోసుకోవచ్చు. పేపర్‌తో తయారు చేసిన కవర్లు మాత్రమే ఉపయోగించుకోవాలి. పాలిథిన్ కవర్లు వాడకూడదు. పేపర్ కవర్లు ఉపయోగిస్తే లోపల గాలి బయటకు.. బయట గాలి లోపలకు వెళ్లే అవకాశం ఉండి కాయ నాణ్యంగా ఉంటుంది.

కవర్ల ఏవిధంగా తొడగాలంటే...

కాయకు కవర్ తొడిగేటప్పుడు కవర్ అడుగుకు కాయ తగలకుండా కొంచెం ఖాళీ ఉండేలా చూసుకోవాలి. ఎందుకంటే కాయ పెరుగుతున్నప్పుడు కవర్ పగిలిపోకుండా ఉంటుంది. కవర్లు వర్షం పడుతున్నప్పుడు లేదా మంచు పడే సమయాల్లో తొడగొద్దు. ఎండ ఉన్న రోజు లేదా అలాంటి సమయాల్లో తోడగాలి. కవర్లు తొడిగేటప్పుడు పురుగులు తెగుళ్ల సోకని కాయలను ఎంపిక చేసుకోవాలి. కవర్లు తొడిగిన తర్వాత అమర్చిన వైరుతో కాడకు జాగ్రత్తగా ఎలాంటి ఖాళీ లేకుండా తొడగాలి.



ఆదాయ వివరాలు ఎకరాకు...

ఎకరానికి కవర్లు వాడకుండా నాలుగు టన్నులు దిగిబడి వస్తుంది. ధర టన్నుకు రూ. 25,000 ఉంటుంది. ఇలా రూ. లక్ష ఆదాయం వస్తుంది. కవర్లు తొడిగితే దిగుబడి పెరగడంతోపాటు కాయ నాణ్యత పెరిగి ధర ఎక్కువగా వస్తుంది, దీంతో అదే ఎకరానికి 4.25 టన్నులు దిగుబడి వస్తుంది. టన్నుకు ధర రూ. 50,000 ఉంటుంది. ఇలా ఎకరాకు సాధారణ ఆదాయంతోపాటు 2,12,500 అధిక ఆదాయం వస్తుందని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు.

కవర్లు తొడగడం వల్ల లాభాలు



కవర్ తొడగడంతో నాణ్యంగా ఉన్న మామిడికాయ

కాయ ఎదిగే దశలో కవర్లు తొడగడం వల్ల ఆ దశలో ఆశించే పురుగులు తీగలు ఉంచి రక్షణ పొందవచ్చు. ముఖ్యంగా పండు ఈగ బారిన పడకుండా కాయలను కాపాడొచ్చు. అదే విధంగా అకాల వర్షాలతో వ్యాపించే మసి తెగులు, బ్యాక్టీరియా మచ్చ తెగులు, పక్షి కన్ను వంటి తెగుళ్లను కూడా ఎలాంటి శిలీంద్రనాసినులు సోకకుండా సమర్థవంతంగా అరికట్టవచ్చు. కవర్లు తొడిగిన మామిడికాయలు మంచి రంగు సంతరించుకుని ఎలాంటి మచ్చలు లేకుండా చూడడానికి ఆకర్షణీయంగా కనిపించి కొనుగోలుదారులను ఆకర్షిస్తాయి. కవర్లు తొడిగితే పురుగు మందులు కొట్టాల్సిన అవసరం ఉండదు.

- మామిడి కాయలకు కవర్లను ఏర్పాటు చేయడం వల్ల రైతుకు ఖర్చు తగ్గుతుంది, దీంతో పాటు పురుగు మందులు కొట్టడం తగ్గడంతో హానికర పురుగుమందుల్లో అవశేషాలు పండులో ఉండవు. దీంతో పండు తిన్నవారికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు దరిచేరవు.
- కవర్లు తొడగడం వల్ల పక్షుల నుంచి కలిగే నష్టాన్ని నివారించవచ్చు. కాయ పెరిగే దశలో వచ్చే అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు లేదా అకాల వర్షాలతో కలిగే నష్టాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చు. కవర్లు తొడగడం వల్ల కాయలపై కొనతో ఏర్పడే మచ్చలను నివారించవచ్చు. కవర్లు తొడిగిన కాయలు త్వరగా పక్వానికి వస్తాయి. కోసిన తర్వాత ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. మార్కెట్లో అధిక ధర వస్తుంది. రైతుకు ఎక్కువ ఆదాయం లభిస్తుంది.

కవర్లు ఎప్పుడు తొడగాలి.. ఎలా తొడగాలి...

కవర్లు ఏ దశలో తొడగాలి అనే అంశం చాలా ముఖ్యం. మరీ లేత దశ అంటే పిందె దశ లేదా గోలీకాయ సైజులో తొడగొద్దు. అలా తొడిగితే కాయ కాడ లేతగా ఉండటం వల్ల కవర్ బరువు తట్టుకోలేక విరిగిపోతుంది. ఒకవేళ మరి ఆలస్యంగా తొడిగితే అప్పటికే అన్ని రకాల పురుగులు తెగుళ్ల ఆశించడంతో ఆశించిన మేర నాణ్యమైన పండ్లను పొందలేం. అందుకే కాయ సుమారు 100 గ్రాము లు బరువు ఉన్నప్పుడు కవర్లు తొడగాలి. అంటే పూత నుంచి సుమారు 55 నుంచి 60 రోజుల తర్వాత తొడగాలి. అంటే కోడిగుడ్డు లేదా నిమ్మ కాయ సైజులో ఉన్నప్పుడు తొడగాలి. కవర్లు తొడిగిన 65–75 రోజులకు కాయ పక్వానికి వస్తుంది. అప్పుడు కవర్లను తొలగించి కాయలను కోసుకోవాలి.

అందుబాటులో సబ్సిడీతో కవర్లు



మామిడి పండ్లకు కవర్ల తొడగడం వల్ల నాణ్యమైన కాయలు వస్తాయి. ఈ కవర్ల ధర సాధారణంగా రూ. 2 అయితే 50 శాతం రాయితీతో ఒక కవర్ రూ.1తో అందిస్తోంది. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన అధికారులను సంప్రదించవచ్చు. – సుబాషిణి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, వైఎస్సార్‌జిల్లా.

అరబిక్ వంట.. కడప ముంగిట!



రంజాన్‌లో అత్తర్ల గుబాళింపులే కాదు రకరకాల వంటలూ ఘుమఘుమలాడిస్తున్నాయి. పసందైన రుచులతో నోరూరిస్తున్నాయి. అల్ ఫహమ్... అల్ మంది..షవర్మ.. హలీం.. ఇలా ఒకటా రెండా అనేక అరబిక్ వంటలు.. కడప ముంగిట వాలిపోయాయి. రుచుల పంటను ఆస్వాదించమని ఆహార ప్రియులను ఆహ్వానిస్తున్నాయి. అసలే రంజాన్.. ఆపై కొత్త వంటకాలు తొంగి చూసిన నేపథ్యంలో సాక్షి సండే స్పెషల్.

- రంజాన్ సీజనంతా... రంజైన రుచుల పంట!
- ఆస్వాదిస్తున్న ఆహారప్రియులు

కడప కల్చరల్: రంజాన్... మనిషిని మానవత్వం గల పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దేందుకు అవకాశాలను అందించే పండుగ. శారీరకంగా, మానసికంగా మనిషిని ఉన్నతుడినిచేసే ఆధ్యాత్మిక వేడుక. ఈ సందర్భంగా మార్కెట్లు, వీధులలో సెంట్లు, అత్తర్ల గుబాళింపులు మనసులను దోచేస్తాయి. ఒక్క సెంట్లు.. అత్తర్లే కాదు.. రంజాన్ అనగానే హలీం.. తదితర పౌష్టికాహారం వంటకాలూ గుర్తుకొస్తాయి. కొన్నేళ్లుగా పలు రకాల అరబిక్ వంటలు కడప ముంగిట వాలిపోయాయి. దాదాపు రెండేళ్లకోసారి ప్రత్యేకమైన అరేబియన్ వంటకం పరిచయం అవుతుండడం విశేషం.

సండే స్పెషల్

అల్ ఫహమ్...

ఇటీవలి కాలంలో ఎక్కువ ఆదరణ పొందిన వంటకం అల్ ఫహమ్. బొగ్గులపై కాల్చిన కోడి మాంసం కావడంతో రుచి బాగుంటుంది. పైగా నూనెలు.. మసాలాలు లేకపోవడంతో ఆరోగ్యానికీ మంచిదన్న కారణంతో ఇప్పుడందరూ ఈ వంటకాన్ని ఇష్టపడుతున్నారు. కాగా కడప నగరానికి చెందిన జమాల్ వలీ దశాబ్దం పైగా అరబ్ దేశాల్లో వంటమాస్టర్‌గా పని చేశారు. ఆ అనుభవంతో కడప వాసులకు తొలిసారిగా 2006లో ఫహమ్‌ను పరిచయం చేశారు. ప్రస్తుతం ‘మాషా అల్లాహ్’ ఫహం నడుపుతూ 8 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.



అల్ మందీ...



రంజాన్ మాసంలోనే కాకుండా ఏడాదంతా లభించే మరో అరబిక్ వంట అల్ మందీ. ఒక పెద్ద పళ్లెంలో పెట్టిన ఆహారాన్ని చుట్టూ ఇద్దరు ముగ్గురు కూర్చుని ఇష్టంగా తింటుంటూరు. సరదాగా ఇతరులతో కలిసి ఆనందించాలనుకునే వారు దీనిని ఇష్టపడతారు. ఆహారంతోపాటు ఆత్మీయతలను కూడా పంచుకునే అవకాశం లభిస్తోంది. ఇక వీటితో పాటు,కబాబ్, షవర్మ, మస్బూస్ తదితర రకాలు ఆహార ప్రియులను ఆకర్శిస్తున్నాయి. సాయంత్రాలలో రంజాన్ ఉపవాస దీక్ష విరమించి స్వీకరించే ఇఫ్తార్‌లో ఇటీవల ఖబాబ్‌లు సాధారమైపోయాయి.



హలీం...

రంజాన్ అనగానే ప్రత్యేక వంటకమైన హలీం గుర్తుకు వస్తుంది. ఉపవాస దీక్షల్లో ఉన్న వారితోపాటు ఇతరులకు కూడా ఇది పౌష్టికాహారం. నిన్నా మొన్నటివరకు కేవలం రంజాన్ మాసంలో మాత్రమే లభిస్తుండిన ఈ వంటకం ప్రస్తుతం అక్కడక్కడ ఇతర సీజన్లలో కూడా అందుబాటులో ఉంటోంది. దానికి ముస్లిమేతరుల నుంచి కూడా లభిస్తున్న ఆదరణ కారణంగా పలు హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా అందుబాటులో ఉండడంతోపాటు రోజువారి స్పెషల్ వంటకం స్థాయికి ఎదిగింది. పైగా పెళ్లిళ్లలోనూ హలీం దర్శనమిస్తుండడం విశేషం. ప్రస్తుతం కేవలం కడప నగరంలోనే హలీం విక్రయించే హోటళ్లు, దుకాణాలు 50కి పైగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 250కి మించాయి.



వ్యాపారం అదుర్స్..

నాన్ వెజ్ వంటకాల దుకాణాలు గణనీయంగా పెరగడంతోపాటు వాటికి ఈ సీజన్‌లో మంచి వ్యాపారం ఉంది. జిల్లా అంతటా ప్రత్యేకించి అరేబియన్ వంటకాల రెస్టారెంట్లు 100కు పైగానే ఉన్నాయి. ఇవిగాక హోటళ్లు, రెస్టారెంట్లతోపాటు చిన్నచిన్న రోడ్డుపైడు దుకాణాలలో కూడా వీటిని అందుబాటులో ఉంచుతున్నారు. ఇటీవల అరేబియన్ ప్రాంతం వంటకాలకు మన ప్రాంతంలో విపరీతమైన ఆదరణ లభిస్తుండడంతో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.

స్వీట్లు కూడా..

కేవలం మాంసాహారమే కాకుండా ఇటీవల రంజాన్ సీజన్‌లో తీపి పదార్థాలను ఆస్వాదించడం కూడా మొదలైంది. ఇటీవల ఇలాంటి వంటకాలలో ఖద్దూకీ ఖీర్, సారకాయ, ఇతర కాయగూరలతో చేసిన స్వీట్లు ఆరోగ్యాన్ని ఇస్తాయన్న నమ్మకంతో ఆరగిస్తున్నారు. ఇవికాకుండా మంచి శక్తినిచ్చే వస్తువులతో తయారు చేసిన గంజి, ఫలుదా, ఫ్రూట్ సలాడ్ బకెట్ కూడా రంజాన్ స్పెషల్ వంటకంగా ఆదరణ పొందుతున్నాయి.





షవర్మా

క్లుప్తంగా

చింతకుంటలో పిడుగు



పిడుగుపాటుకు గురై కాలుతున్న చెట్టు

ముద్దనూరు : మండలంలోని చింతకుంటలో శనివారం ఓ టెంకాయ చెట్టుపై పిడుగు పడింది. సాయంత్రం కురిసిన అకాలవర్షంలో చెట్టుపై పిడుగుపడి పాక్షికంగా దెబ్బతినింది. జనావాసాలకి కొంచెం దగ్గరలోనే ఈ పిడుగు పడడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. అయితే చెట్టుపై పిడుగుపడడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

వీధి కుక్కల స్వైర విహారం

– ఆరుగురిని కాటేసిన శునకాలు



కుక్కల దాడిలో గాయపడిన వెంకట లక్షుమ్మ

కమలాపురం : మండలంలోని పెద్దచెప్పలి, ఎల్లారెడ్డిపల్లె గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేసి ఆరుగురిని గాయపరిచాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పెద్దచెప్పలితో పాటు ఎల్లారెడ్డిపల్లెలో ఉన్న కుక్కలు మనుషులపై దాడి చేశాయి. ఎల్లారెడ్డిపల్లెకు చెందిన వెంకట లక్షుమ్మ ఇంటి ముందు కసువు ఊడ్చుతుండగా కుక్క వచ్చి కాలు పట్టుకొని కాటేసింది. అలాగే పెద్దచెప్పలిలో ఆడుకుంటున్న చిన్నారులు రెహమాన్, కావేరిపై కుక్కలు దాడి చేశాయి. వారితో పాటు మరో ముగ్గురికి కూడా కుక్కలు కరిచి గాయాలు చేశాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాయపడిన వారంతా కమలాపురం సీహెచ్‌సీకు చేరుకుని వైద్య సేవలు పొందారు. గ్రామంలో వీధి కుక్కలు ఎక్కువయ్యాయని, వాటిని తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. కాగా పెద్దచెప్పలి, ఎల్లారెడ్డిపల్లెకు చెందిన ఆరు మందికి వైద్య సేవలు అందించినట్లు కమలాపురం సీహెచ్‌సీ వైద్యులు తెలిపారు.

చెరువు మట్టి.. చెరబట్టి

- నాగసానిపల్లె చెరువులో ఇష్టారాజ్యంగా త్వకాలు
- నాలుగు నెలలుగా ఇదే తంతు
- నిబంధనలకు మించి తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- మట్టి తవ్వాకాలను అడ్డుకున్న ఎస్టీకాలనీ వాసులు



చెరువులో మట్టిని తరలించకుండా నిరసన తెలుపుతున్న గ్రామస్థులు



నాగసానిపల్లె చెరువులో మట్టి తరలించడంతో ఏర్పడిన గుంతలు

ఖాజీపేట : కొత్త చెరువులు నిర్మించక పోయినా పర్వాలేదు కానీ.. ఉన్న చెరువులకు నష్టం కల్గకుండా అధికారులు చర్యలు తీసుకుంటే చాలని రైతన్నలు అంటున్నారు. పూర్వం నిర్మించిన చెరువులను రోడ్డు నిర్మాణం కోసం అనుమతులు ఉన్నాయని ఇష్టం వచ్చినట్లు ప్రైవేటు కాంట్రాక్టర్లు చెరువును తవ్వేస్తూ ధ్వంసం చేస్తున్నారు.. ఫలితంగా మా చెరువును కాపాడండి మహాప్రభో అంటూ నాగసానిపల్లె రైతులు ఆందోళన చేశారు. అధికారులు పట్టించుకోలేదు. తాజాగా శనివారం ఎస్టీకాలనీ వాసులు చెరువు మట్టిని తరలించకుండా అడ్డుకున్నారు. వారం రోజులుగా నిరసన తెలుపుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు.

ఒండ్రు మట్టిపై కాంట్రాక్టర్ల కన్ను

ఖాజీపేట మండలం నాగసానిపల్లె చెరువు పూర్తిగా మంచి ఒండ్రు మట్టితో నిండి ఉంది. ఆ మట్టిపై కొందరు క్రాంట్రాక్టర్లు కన్నెశారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వ అనుమతులు ఉన్నాయన్న సాగుచూపి పెద్ద ఎత్తున జేసీబీలు, టిప్పర్లు పెట్టి తవ్వకాలు మొదలు పెట్టారు.. తెల్లవారుజాము నుంచి రాత్రి పగలు తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నారు. ఇలా నాలుగు నెలల నుంచి చెరువు నుంచి మట్టిని తన్నుకుపోతున్నారు.

చెరువులో నీరు నిల్వ కష్టమే..

కన్నెలవాగు చెరువులోకి నీరు పూర్తిగా వర్షపాతం వల్ల వస్తుంది. కొండల్లో వర్షం పడితే నీరు చేరుతుంది.. లేకపోతే నీరు వచ్చే అవకాశం లేదు. ప్రతి మూడు లేక నాలుగు సంవత్సరాలకు ఒక సారి మాత్రమే వర్షం వల్ల చెరువు నిండుతుందని స్థానికులు అంటున్నారు.. చెరువు నిండితే భూగర్భ జలాలు పెరిగి పంటలు సాగు చేసుకునే అవకాశం రైతులుకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అయితే చెరువులో మట్టిని కనిష్ట స్థాయికి తవ్వేస్తున్నారు.. ప్రస్తుతం ఉన్న చెరువు నుంచి సుమారు 15 అడుగుల లోతు మట్టిని తవ్వేస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తూము మద్ద కంటే చాలా దిగువకు మట్టిని తీస్తున్నారు. చెరువు దిగువన గలుగు రాయి వచ్చే స్థాయికి మట్టిని తరలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల చెరువులో నీరు నిల్వ ఉండటం కష్టమే అని రైతులు అంటున్నారు. ఒక వేళ నీరు చేరినా తూము పైభాగం వరకు నీరు చేరేది కష్టమే అని రైతులు అంటున్నారు. పైన ఉన్న సారవంతమైన మట్టిని పూర్తిగా తొలగించడం వల్ల నీరు నిల్వ ఉండే అవకాశం లేదంటున్నారు. ఫలితంగా వచ్చిన నీరంతా భూగర్భంలోకి త్వరగా ఇంకిపోతుందని అంటున్నారు.. దీనివల్ల చెరువులో నీరులేక, భూగర్భ జలాలు ఇంకిపోయి రైతుల బోర్లకు నీరు అందని పరిస్థితి వస్తుందని రైతులు వాపోతున్నారు.

నిబంధనలకు పాతర

జాతీయ రహదారి నిర్మిణం కోసం చెరువులో మట్టిని తవ్వుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. అయితే నిబంధనలకు పాతర వేశారు. 10 అడుగుల కంటే మించకూడదని, తూము కంటే దిగువకు మట్టిని తియ్యరాదని అంటున్నారు. కానీ 15 అడుగుల లోతు తీసున్నారు. 2లక్షల క్యూబిక్ మీటర్లు మాత్రమే తవ్వేందుకు అనుమతులు ఇచ్చారు. అయితే అంతకు మించి తవ్వుతున్నారని రైతులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం సాధారణ అవసరాలకు అయితే ఒక క్యూబిక్ మీటరుకు రూ. 50 నుంచి రూ. 60 చెల్లించాలి.. అదే కమర్షియల్ అవసరాలకు అయితే రూ.135 నుంచి 140 చెల్లించాలి.. కానీ ఎంత రాయల్టీ చెల్లించారు.. ఎంత మట్టిని తరలించారు..అనుమతులకు మించి ఎమైనా మట్టిని తవ్వుతున్నారా.. ఎంత వరకు అనుమతులు ఉన్నాయి అని రైతులు అడిగితే అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే సదరు కాంట్రాక్టర్లు మాత్రం రాయల్టీ చెల్లించామని, అన్ని అనుమతులు ఉన్నాయని స్థానికులకు చెప్పడం విశేషం.

ఐదు రోజులుగా నిరసనలు

చెరువులోని మట్టిని తరలించవద్దు అంటూ నాగసానిపల్లెలోని ఎస్టీకాలనీ వాసులు ఐదు రోజుల నుంచి నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. చెరువు నుంచి మట్టిని తరలించుకు పోయే ప్రధాన రహదారికి అడ్డుగా మట్టి కుప్పలు వేసి అక్కడే కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు వచ్చి బెదిరించినా భయపడకుండా మా చెరువు నుంచి మట్టిని తీసుకు పోనివ్వం అని తెగేసి చెబుతున్నారు.

పోలీసులతో బెదిరింజులు

మట్టిని తరలించుకునేందుకు అవకాశం కల్పించకపోతే మీపై కేసులు పెడతామని కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. అయితే మీకు మట్టి కావాలంటే ఎక్కడ నుంచైనా తీసుకోవచ్చు.. మా భూములకు నీరు కావాలంటే ఎలా వస్తుందని రైతులు కాంట్రాక్టర్లను గ్రామస్తులు ప్రశ్నంచారు. దీంతో చేసేదేమీ లేక పోలీసులను పంపించారు. మీపై కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేశారు. దారి వదలక పోతే కేసులు నమోదు చేస్తామని పోలీసులు బెదిరిస్తున్నారని రైతులు అంటున్నారు. కేసులకు భయపడేది లేదని భూములు పోతే మా బతుకు పోతుందని నిరసన కొనసాగిస్తునామన్నారు.

పంటలు దెబ్బతింటున్నాయి

చెరువు నుంచి మట్టిని రోజు తరలించడం వల్ల వచ్చే దుమ్ము వల్ల పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. నష్టం భరించలేక రైతులు కోపంతో వాహనాలను ఆపి గతంలో రెండు సార్లు ధర్నాలు చేశారు. అయితే పంట నష్టం పరిహారం ఇస్తామని చెప్పి నిరసన ఆపించారు. అయితే రైతులకు పరిహారం పూర్తిగా ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. కాంట్రాక్టర్ స్వర్థం కోసం రైతులు నష్టపోవాలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

అధికారుల తీరుపై మండిపాటు

స్థానిక అవసరాల కోసం రైతులు ఎదైనా మట్టిని తరలిస్తే అధికారులు ఆఘమేఘాలపై స్పందిస్తారు.. వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ ఫెనాల్టీలు వేసి రైతులను ఇబ్బందికి గురిచేస్తారు. అయితే మట్టిని కాంట్రాక్టర్లు తవ్వకుంటూపోతున్న.. తెలిసి పట్టించుకోక పోవడంపై రైతులు స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మట్టిని తరలిస్తున్న విషయం స్థానికులు తహసీల్దార్, పోలీసులు, చిన్ననీటి పారుదల శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందించక పోవడంపై స్థానిక రైతులు మండిపడుతున్నారు.

ఇష్టానుసారంగా తవ్వకాలు



నాకు 2.5 ఎకరాల పొలం చెరువు దగ్గర ఉంది. వరి సాగుచేస్తున్నాను. చెరువులో మట్టిని ఇష్టం వచ్చినట్లు తోడేస్తున్నారు. 15 అడుగుల లోతు మట్టిని తీసుస్తున్నారు. చెరువు ధ్వంసం అవుతోంది. చెరువుకు నీరు వచ్చినా నిల్వ ఉండదు. బోర్లకు నీరు రాదు. రైతులకు తీరని నష్టం కలుగుతుంది.

– బుక్కే హేమలా నాయక్, నాగసానిపల్లె ఎస్టీకాలనీ

చెరువులో మట్టిపోతే నీరు కష్టం



నాకు చెరువు కింద ఎకరా పొలం ఉంది. వరి సాగు చేస్తున్నాను. ఇంత లోతుగా మట్టిని తీస్తే తూముకు నీరు చేరెదెప్పుడు.. కాలువకు నీరు వచ్చేదెప్పుడు?. బోరునుంచి నీరు వచ్చేలా కనిపించడం లేదు. మట్టి తవ్వకాలను వెంటనే ఆపాలి.

– బాబా నాయక్, నాగసానిపల్లె ఎస్టీకాలనీ

చెరువు దెబ్బతింటే రైతులేంకావాలి



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మట్టిని చెరువు నుంచి తోడేస్తున్నారు.. రాత్రి పగలు తేడా లేకుండా పనిచేస్తున్నారు. చెరువు మా గ్రామానికి అవసరం. రోడ్డు కోసం మట్టి కావాలంటే కొండల నుంచి కానీ ఇతర ప్రాంతాల నుంచి తీసుకోవచ్చు.. చెరువు దెబ్బతింటే రైతులంతా ఎంకావాలి.. మట్టిని తరలిస్తే ఒప్పుకునేది లేదు.

– బలరామ్ నాయక్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్టీకాలనీ

అనుమతులు తీసుకున్నాం

నాగసానిపల్లి చెరువు నుంచి జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకున్నాం.. రెండు లక్షల క్యూబిక్ మీటర్ల వరకు మట్టిని తీసుకెళ్ల వచ్చు. జాతీయ రహదారి నిర్మాణం కోసమే మట్టిని వాడుతున్నాం, ఇతర అవసరాలకు కాదు. ఎక్కడ హెచ్చుతగ్గులు లేకుండా, రైతులకు ఇబ్బందులు లేకుండా మట్టిని తీసుకెళుతున్నాం.

– జయప్రకాష్, కాంట్రాక్ట్ నిర్వహణ అధికారి

జాతీయ డ్రైవర్ల కమిషన్ ఏర్పాటు చేయాలి



చలో డిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : డ్రైవర్లు వారి కుటుంబాల రక్షణ, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే జాతీయ డ్రైవర్ల కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఆలిండియా సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అన్వర్‌బాష, కడప ఇన్‌చార్జి అయ్యప్ప కోరారు. అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం నిర్వహించిన చలో ఢిల్లీ కార్యక్రమంలో వారు మాట్లాడారు. రహదారులపై డ్రైవర్లకు రోజురోజుకు సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, రవాణా అధికారుల వేధింపులు అధికమవుతున్నాయన్నారు. అనుకోని రీతిలో అకాల ప్రమాదాల బారిన పడితే తమ కుటుంబాలను ఆదుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సుమారు 30 కోట్ల మంది డ్రైవర్లుగా పనిచేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థ చోదక శక్తులుగా ఉన్నారని పేర్కొన్నారు. విలువైన సేవలు అందిస్తున్న తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా జాతీయ డ్రైవర్ల కమిషన్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయిలో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎస్.మహమ్మద్‌బాష, లింగమూర్తి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు చేపట్టాలి

– ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు



స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ వీఎస్ఆర్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న శేషయ్య తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వేంపల్లె ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఈశ్వరయ్యపై సత్వరమే చర్యలు చేపట్టాలని వేంపల్లె టీడీపీ నాయకుడు శేషయ్యతో పాటు కార్యాలయ పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు నాగసుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, శేషారెడ్డి, వెంకటేశ్, రాజశేఖర్‌రెడ్డి, నాగేష్‌రెడ్డి, గంగయ్య, వాసుదేవారెడ్డి తదితరులు కోరారు. ఈ మేరకు వారు శనివారం కడపలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ వీఎస్ఆర్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ అభ్యర్థన మేరకు వేంపల్లె ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకునేందుకు డీఐజీ హామీ ఇవ్వడంపై ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సబ్ రిజిస్ట్రార్ అవినీతికి అంతే లేకుండా పోతోందన్నారు. ఇతనిపై గతంలో కూడా ఫిర్యాదు చేయగా, విచారణలు సైతం జరిగాయన్నారు. వేంపల్లె సబ్ రిజిస్ట్రార్‌పై డీఐజీ చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబును సంప్రదించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేంపల్లె ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేసినట్లు తెలియజేశారు.

బద్వేలులో యువకుల బాహాబాహి

– ఐదుగురిపై కేసు నమోదు

బద్వేలు అర్బన్ : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో శనివారం డబ్బు బాకీ విషయమై కొందరు యువకులు ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన ఐదుగురు యువకులపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని చింతలచెరువు బీసీకాలనీకి చెందిన గొడుగునూరునాగరాజు వృత్తి రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అట్లూరు మండలానికి చెందిన కుంభగిరిశివశంకర్ వద్ద నాగరాజు రూ.50 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఏడాది కిందట శివశంకర్ హైదరాబాద్‌కు వెళ్ళి నాగరాజు ద్విచక్ర వాహనాన్ని తీసుకువచ్చాడు. అయితే శనివారం స్థానిక త్యాగరాగకాలనీలో బంధువుల పుట్టువెంట్రుకల కార్యక్రమం ఉండటంతో అందరూ అక్కడ కలిశారు. ఈ సమయంలో మాటమాట పెరగడంతో ఘర్షణకు దిగారు. పోలీసులు ఘర్షణ పడిన వారిని అదుపులోకి తీసుకుని నాగరాజు, శివశంకర్ లతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొండాపురం : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ సమీపంలోని కడప–తాడిపత్రి జాతీయ రహదారిపై శనివారం ట్రాక్టర్ ట్రాలీని టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు మహిళలు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. ముద్దనూరు నుంచి తాడిపత్రి వరకు చేపట్టిన నాలుగు వరుసల రోడ్డు నిర్మాణ పనులు కోసం వచ్చిన మహిళా కూలీలు వెంకటాపురం వద్ద ట్రాక్టర్ ట్రాలీ నుంచి దిగుతుండగా తాడిపత్రి వైపు వెళ్లే టిప్పర్ ఢీ కొంది. మహిళలు శివమ్మ, రమాదేవి, భవాని గాయపడ్డారు. వారిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రసాయన రహిత ఏపీగా చేయాలన్నదే ఉద్దేశం

పులివెందుల రూరల్ : రసాయన రహిత ఆంధ్రప్రదేశ్‌గా చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని రైతు సాధికారిక సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఐజీగార్డ్‌లో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కడప, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సాధికారిక సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ బీడు భూములలో నవధాన్యాలను వేసుకుని వాటిని 60 రోజులకే భూమిలోకి కలుపుకోవడంవలన భూమికి సారవంతం వచ్చి కర్బన శాతం అనేది పెరుగుతుందన్నారు. భూమిలో సూక్ష్మ జీవులు అభివృద్ధి చెంది మంచి పంటలు వస్తాయన్నారు. వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

కడప – బెంగళూరు రైల్వే పనులను పూర్తి చేయాలి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి



నిరసన వ్యక్తం చేస్తున్న వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప బెంగుళూరు రైల్వే పనులను 20 సంవత్సరాల క్రితం మెదలు పెట్టినప్పటికీ అప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణ పనులను పూర్తి చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు సిఆర్వి ప్రసాద్ అన్నారు. శనివారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక కమిటీ ఆధ్వర్యంలో పబ్బాపురం వద్ద కడప బెంగళూరు రైల్వే ట్రాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప– బెంగళూరు రైల్వే పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైల్వే లైన్ పూర్తి చేయడంలో పూర్తిగా అలసత్వం వహిస్తున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం కేవలం అమరావతి సాకుగా చూపించి రాష్ట్ర బడ్జెట్ అంత అమరావతి కేటాయించాలని చేడటం దారుణం అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలిగాని కేంద్రీకరణ చేయాలనుకోవడం సిగ్గుచేటని వారు దుయ్యబట్టారు. కడప బెంగళూరు రైల్వే లైను పూర్తయితే కడప జిల్లాలో ఎక్కువ మంది రైతులు పండించుకునే ధాన్యాలను కూరగాయలను బెంగళూరు వంటి ప్రాంతాలకు సులువుగా మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. అసెంబ్లీలో కానీ, పార్లమెంటులో కడప బెంగళూరు రైల్వే పనులను పూర్తిచేయాలని ఒక్క రాజకీయ నాయకుడు కూడా ప్రస్తావన చేయకపోవడం దారుణం అన్నారు. రాయలసీమ ప్రాంతం నుండి ఎన్నికైన ప్రజాప్రతినిధులు రైల్వే పనులను పూర్తిచేయాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుర్రప్ప,అంజి, సుబ్బరాయుడు, జయవర్ధన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- ఒంటిమిట్టను టూరిజం కేంద్రంగా మార్చాలి
- కడప–రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు
- బుగ్గవంక అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేయాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి డిమాండ్



కడప కార్పొరేషన్ : జిల్లాలో ఉన్న పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసన మండలి సమావేశాల్లో జిల్లాలోని పలు సమస్యలను లేవనెత్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించామన్నారు. కడప– రేణిగుంట గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు పనులకు రెండేళ్ల క్రితం కేంద్ర మంత్రి శంకుస్థాపన చేసినప్పటికీ ఇంతవరకూ ఆ పనులు ప్రారంభించలేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో అటవీ శాఖ అనుమతులు లేవని పనులు ఇంకా ప్రారంభించలేదన్నారు. అలాగే కడప నగరంలో ఉన్న సీపీ బ్రౌన్ లైబ్రరీకి సంబంధించి గత ప్రభుత్వంలో అదనపు గదుల నిర్మాణం కోసం 6.80 కోట్లు మంజూరైందని, ఆ పనులు ఇంకా ప్రారంభించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్టను టూరిజం కేంద్రంగా మార్చి అక్కడున్న చెరువులో బోట్లను నడపాలని సూచించారు. కడప నగర సుందరీకరణలో భాగంగా బుగ్గవంక చుట్టూ 8 కి.మీల మేర అప్రోచ్ రోడ్లు వేయాల్సి ఉండగా, ఇప్పటికీ 3 కి.మీల రోడ్డు మాత్రమే పూర్తయ్యిందని, మిగిలిన రోడ్డు కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. కమలాపురం–కడప రహదారిలో పాపాఘ్ని నదిపై నిర్మించిన కొత్త వంతెన నిర్మాణం కొంత భాగంగా ఇంకా పెండింగ్‌లోనే ఉందని, దాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, 9నెలల కాలం గడుస్తున్నా వాళ్లకు ఇవ్వాల్సిన బకాయిలు ఇంకా ఇవ్వకపోవడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 12వ పీఆర్‌సీపై కమిటీ వేసిందని, ఆ కమిటీ రద్దయ్యిందని, కొత్త కమిటీ వేసి 12వ పీఆర్‌సీ ప్రకటించాలన్నారు. ఉద్యోగులకు, పోలీసులకు ఇవ్వాల్సిన డీఏ, ఐఆర్, జీపీఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలను కూడా ప్రస్తావించానని, వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పెళ్లికి పిలవడానికి వచ్చి చోరీ



నిందితుడి అరెస్టు చూపించి వివరాలను తెలియజేస్తున్న సీఐ నరేష్‌బాబు

ఎర్రగుంట్ల : పట్టణంలోని 12వ వార్డులో నివాసం ఉండే మహబూబీని పెళ్లికి పిలవడానికి వచ్చి ఆమె చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని చోరీ చేసిన కేసులో నిందితుడు కొత్తపల్లి ఖాసీంపీరాను అరెస్టు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. శనివారం కేసు వివరాలను సీఐ వెల్లడించారు. ఖాజీపేట గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన ఖాసీంపీరా చెడు వ్యసానాలకు లోనై అప్పులు చేశాడు. ఇతను చాలా ఏళ్లుగా మట్కా బెట్టింగ్, అప్పులు అధికంగా చేశాడు. ఎలాగైన తెచ్చిన అప్పులు కట్టడం కోసం అడ్డ దారిలో డబ్బు కోసం ముసలి వారిని టార్గెట్ చేసుకున్నాడు. వారితో పరిచయం చేసుకుంటూ మాయ మాటలు చెప్పి వారి వద్ద నుంచి బంగారు వస్తువులు, డబ్బులు లాక్కుని పారిపోతుంటాడని చెప్పారు. ఇలా ఖాసీంపీరాపై పలు కేసులు ఉన్నాయన్నారు. ఈ తరుణంలో ఈ నెల 9వ తేదీన కడప పాత బస్టాండ్ దగ్గర నుంచి ఆటో తీసుకుని వల్లూరు, కమాలపురం, ఎర్రగుంట్లకు వచ్చాడు. యర్రగుంట్ల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న మహబూబీ అనే వృద్ధురాలి వద్దకు వెళ్లి నిద్రలేపాడు. నేను మీ కోడలి బంధువు అని నమ్మించాడు. మా పాపాకు పెళ్లి చేస్తున్నాం.. అందరూ పెళ్లికి రావాలన్నాడు. పెళ్లికి కూతురికి మీ చేతికి ఉన్న ఉంగరంను అదే సైజులో చేయించాలి. మీ ఉంగరం ఇస్తే బయట ఆటోలు కూర్చొని ఉన్న వారికి చూపించి వస్తాను అని చెప్పాడు. దీంతో మహబూబీ నమ్మి చేతికి ఉన్న బంగారు ఉంగరం తీసి ఇచ్చింది. ఆ ఉంగరం తీసుకొని ఖాసీంపీరా అక్కడ నుంచి ఊడాయించాడు. దీంతో బాధితురాలు మహబూబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఖాసీంపీరాను ఎర్రగుంట్లలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆరోగ్య శాఖలో పదోన్నతులు కల్పించండి

పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్



వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ రామగిద్దయ్యకు వినతి పత్రం సమర్పిస్తున్న యూనియన్ నాయకులు

కడప కార్పొరేషన్ : వైద్య ఆరోగ్య శాఖలో అన్ని కేడర్లలో ఉన్న ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే. అహరోను కోరారు. శనివారం వైద్య,ఆరోగ్య సంచాలకులు డా. బి.రామ గిడ్డయ్యకు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జోన్‌లోని అనంతపురం, చిత్తూరు, కర్నూలు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, పదోన్నతుల్లో జాప్యాన్ని నివారించాలని కోరారు. అన్ని కేడర్ల సీనియారిటీ జాబితాలను వెంటనే విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. ఈ మేరకు ముందస్తుగా జాబితాలను విడుదల చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి గుర్తింపు సంఘాలతో సమావేశం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ బాలక్రిష్ణ, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు లక్ష్మి నారాయణ, కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, సంపత్ కుమార్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు షేక్ బాబా సాహెబ్, కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసుల రెడ్డి, బాషా, వీరేంద్ర రామసుబ్బారెడ్డి, శ్రీనివాస్ యాదవ్ లు పాల్గొన్నారు.